ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5



విజయనగరం

జిల్లా వార్తలు

గురువారం 24 అక్టోబరు 2024

## చింతపల్లి తీరాన్ని పరిశీలించిన కలెక్టర్

పూసపాటిరేగ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): చింతపల్లి సముద్రతీర ప్రాంతాన్ని బుధవారం కలెక్టర్ అంబేడ్కర్ పరిశీలించారు. తుఫాను కారణంగా తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో మాట్లాడారు. స్థానిక మత్స్యకారులకు సూచనలిచ్చారు. ఎప్పటికప్పుడు తీరంలో పరిస్థితులపై ఉన్నతాధికారులకు సమాచారం అందజేయాలని సిబ్బందికి తెలిపారు. అదే విధంగా మండలంలో క్లోరినేషన్ జరిగిన తీరును అడిగి తెలుసుకొన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ గోవింద్ ఉన్నారు.






విజయనగరం రైల్వేస్టేషన్‌లో కంట్రోల్ రూం

## టెన్షన్.. టెన్షన్

- బంగాళాఖాతంలో కొనసాగుతున్న వాయుగుండం
- నేటి నుంచి జిల్లాలో భారీ వర్షాలకు అవకాశం

విజయనగరం, అక్టోబరు23 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో వాయుగుండం కొనసాగుతున్నట్లు వాతావరణ కేంద్రం చెప్పడంతో జిల్లా వాసులు టెన్షన్ పడుతున్నారు. గురు, శుక్రవారాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనడంతో మరింత కలవరపడుతున్నారు. బుధవారం రాత్రి నాటికి పారాదీప్‌కు ఆగ్నేయంగా 700 కిలోమీటర్లు, సాగర్ ద్వీపానికి దక్షిణ ఆగ్నేయంగా 750 కిలోమీటర్ల దూరంలో వాయుగుండం కేంద్రీకృతమై ఉంది. ఇది పశ్చిమ వాయువ్యదిశగా పయనించి తూర్పు మధ్య బంగాళా ఖాతంలో తుఫానుగా మారనుంది. వాయుగుండం ప్రభావంతో తీరం వెంబడి గంటకు 45 నుంచి 55 కిలోమీటర్లు వేగంతో గాలులు వీచే అవకాశం వుంది. మరోవైపు మత్స్యకారులు చేపల వేటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పటికే చేపల వేటకు వెళ్లినవారు తక్షణమే తీరానికి చేరుకోవాలని సూచించారు. ఎలాంటి విపత్కర పరిస్థితి వచ్చినా దీటుగా ఎదుర్కోవడానికి జిల్లా అధికారులు సన్నద్ధమయ్యారు. ఆ మేరకు కిందిస్థాయి సిబ్బందికీ సూచనలు ఇచ్చారు. తుఫాన్ షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నారు. కంట్రోల్ రూంలు కేటాయించారు. విజయనగరం మీదుగా ఒడిశా వెళ్లే పలు రైళ్లను రైల్వేశాఖ రద్దు చేసింది. ఈ వివరాలు ప్రయాణికులకు తెలియజేసేందుకు విజయనగరం రైల్వే స్టేషన్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసింది. కాగా దానా తుఫాన్ జిల్లాలో ఎలాంటి పరిస్థితిని సృష్టించినా దీటుగా ఎదుర్కొనేందుకు జిల్లా అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామని కలెక్టర్ అంబేడ్కర్ తెలిపారు. మత్స్యకారులకు వేటకు వెళ్లవద్దని సూచించామని, అధికారులంతా ప్రజలకు అందుబాటులో ఉండాలని చెప్పామన్నారు.

## నాడు విస్మరించి.. నేడు విచారిస్తారా?

- డయేరియా బాధితుల పరామర్శకు నేడు జగన్ రాక
- శవ రాజకీయాలుగా పేర్కొంటున్న కూటమి నేతలు
- నాలుగేళ్ల కిందట రామతీర్థంలో విధ్వంసం
- అయినా అప్పట్లో జిల్లా వైపు చూడని అప్పటి సీఎం



నాడు ఎన్నో దారుణాలు చోటుచేసుకున్నాయి. రామతీర్థంలో విగ్రహాలు ధ్వంసం అయ్యాయి. ప్రకృతి వైపరిత్యాలు సంభవించాయి. ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి. ఆయనలో మాత్రం కదలిక లేదు. మౌనముద్ర దాల్చారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టించారు. అరెస్టులు చేయించారు. కట్ చేస్తే.. ప్రజాగ్రహంతో అధికారం పోయింది. ప్రతిపక్షనేత హోదా కూడా దక్కలేదు. ఇప్పుడు ఆయన గారికి ప్రజలు గుర్తొస్తున్నారు. గుర్లలో డయేరియా బాధితుల పరామర్శకు ఏముఖం పెట్టుకుని వస్తున్నారని కూటమి నేతలు ప్రశ్నిస్తున్నారు. ఆయన పాలనా వైఫల్యంతో జరిగిన ఘటనలనూ రాజకీయం చేసి లబ్ధి పొందాలని చూస్తున్నారని మండిపడుతున్నారు.

విజయనగరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):

గుర్ల మండలంలో డయేరియా ప్రబలిన అంశాన్ని కొద్దిరోజులుగా ప్రతిపక్షం వైసీపీ రాజకీయం చేస్తోంది. వేర్వేరు కారణాలతో మృతిచెందిన వారికి డయేరియాను ఆపాదిస్తోంది. 11 మంది మృత్యువాత పడ్డారని ఆరోపిస్తోంది. ఇప్పుడు ఆ పార్టీ అధినేత జగన్ కూడా అదే దారిలో వెళ్తున్నారు. ప్రభుత్వాన్ని అహేతుకంగా విమర్శించేందుకు ఏకంగా గుర్ల గ్రామానికి గురువారం వస్తున్నారు. కాగా వైద్య ఆరోగ్యశాఖ మాత్రం ఒక్కరు మాత్రమే డయేరియాతో మృతి చెందినట్టు స్పష్టంచేసింది. వైసీపీ మాత్రం జిల్లాలో ఏదో జరిగిపోతోందని, అందుకు ప్రభుత్వమే కారణమని అదే పనిగా ఆరోపణలు చేస్తోంది. ఉద్దేశ పూర్వకంగానే ప్రభుత్వ వైఫల్యం అంటూ ముద్ర వేసే ప్రయత్నం చేస్తోంది. మరోవైపు భూగర్భ జలాలు కలుషితమే డయేరియాకు కారణమని అధికారుల నివేదికలో తేలింది. అదే సమయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలే అవుతోంది. ఈ తక్కువ వ్యవధిలో అద్భుతాలు చేసేయ గలదా అన్న విషయాన్ని ప్రతిపక్షం విస్మరిస్తోంది. ఐదేళ్లుగా వైసీపీ అధికారంలో ఉన్న విషయాన్ని ఆ పార్టీ నేతలు మరిచి పోయి విమర్శలు చేస్తున్నారు. ఇటీవలే డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ బాధితులను పరామర్శించారు. ఇది గత ప్రభుత్వ వైఫల్యమేనని తేల్చేశారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీ రు వంటి విషయాలను నిర్లక్ష్యంగా విడిచిపెట్టడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని ఆరోపించారు. దీనిని ఖండించేందుకే జగన్ పనిగట్టుకుని జిల్లాకు వస్తున్నారన్న విమర్శ లు ఉన్నాయి. నాడు పాలనలో వైఫల్యం చెంది ఇప్పుడు బాధితులను ఏ మొహం పెట్టుకొని వస్తున్నారని కూటమి పార్టీల నేతలు ప్రశ్నిస్తున్నారు.

### రామతీర్థంలో అపచారం జరిగినా..

వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో ఎన్నో రకాల విధ్వంసాలు, అపచారాలు, ప్రభుత్వ వైఫల్యాలు బయటపడ్డాయి. అయినా నాడు సీఎం హోదాలో ఉన్న జగన్ జిల్లా వైపు కనీసం చూడలేదు. రాష్ట్రంలోనే ప్రముఖ దేవస్థానాల్లో ఒకటైన రామతీర్థంలో బోడికొండపై ఉన్న కోదండరామాలయంలోని విగ్రహాలను 2020 డిసెంబరు 28న అగంతుకులు ధ్వంసం చేశారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా కుదిపేసింది. అప్పటి ప్రధాన ప్రతిపక్షాలైన ( మిగతా 8వ పేజీలో...)

## ఎందుకిలా?

- జిల్లాను వెంటాడుతున్న డయేరియా భయం

విజయనగరం కలెక్టరేట్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజలను డయేరియా వణికిస్తోంది. అనేక గ్రామాల్లో పారిశుధ్యం పడకేసింది. తాగునీరు కాలుష్యమవుతోంది. ఈ కారణాల వల్లే డయేరియా ప్రబలుతోందని వైద్యులు సైతం నిర్ధారించారు. ఐదేళ్ల కాలంలో గ్రామాల అభివృద్ధిని విస్మరించిన కారణంగానే ఈ దుస్థితి నెలకొందని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

గుర్లలో డయేరియా విజృంభించడం జిల్లా, రాష్ట్ర స్థాయిలో చర్చనీయాంశమైంది. గజపతినగరం మండలంలోని కెంగువ, దత్తిరాజేరు మండలంలోని దాసరిపేట, కన్నాం, గుచ్చిమి వంటి గ్రామాల్లోనూ డయేరియా కేసులు బయటపడడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఈ పరిస్థితిలో జిల్లా వ్యాప్తంగా వైద్య సిబ్బందితోపాటు సచివాలయం ఉద్యోగులు ఇంటింటా వెళ్లి ఎవరికైనా వాంతులు, విరేచనాలతో బాధపడుతున్నారా అంటూ అడిగి తెలుసుకుంటున్నారు. కాగా ఐదేళ్లు వైసీపీ పాలనలో పంచాయతీలను పూర్తిగా గాలికి వదిలేశారు. గతంలో టీడీపీ హయంలో ( మిగతా 8వ పేజీలో...)

### జగన్.. శవ రాజకీయాలు మానుకో..

విపత్తులు, ప్రజలకు కష్టాలు వచ్చినప్పుడు రాజకీయాలకు అతీతంగా పని చేయాలి. మాజీ సీఎం జగన్ శవ రాజకీయాలు మానుకోవాలి. గత ఐదేళ్ల పాలనలో గ్రామాల్లో అభివృద్ధి లేదు. మౌలిక సదుపాయాలూ కల్పించలేదు. జగన్ పాపాలే నేటి దుస్థితికి కారణం. అవే కూటమి ప్రభుత్వానికి వారసత్వంగా వస్తున్నాయి. అయినా కూటమి ప్రభుత్వం ముందుకే పోతుంది. ప్రజలతోనే ఉంటుంది. ఇలాంటి శవరాజకీయాలను ప్రజలు నమ్మరన్న విషయాన్ని జగన్ తెలుసుకోవాలి.

-ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు



## పోలియో ఉన్నా.. ధైర్యమే మిన్న

ఆయన ధైర్యం ముందు పోలియో ఓడింది. వ్యాధి ఏదైనా సంకల్పబలం ఉంటే ఏం చేయలేదని నమ్మాడు. నేటికీ అదే తెగువతో ముందుకెళ్తున్నాడు. బొబ్బిలి పట్టణంలోని ఇందిరమ్మకాలనీకి చెందిన చీమల రాంబాబు మూడు నెలల ప్రాయంలోనే పోలియో బారిన పడ్డాడు. బాల్య దశలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. వయసు పెరిగాక బాధపడడం మాని ధైర్యాన్ని పెంచుకున్నాడు. తన ప్రమేయం లేకుండా సోకిన వ్యాధి తనను ఏం చేయలేదని, ఎంతకైనా ఎదురీదుతానని నిర్ణయించుకున్నాడు. అదే తెగువతో స్వశక్తిపై రాణిస్తూ ఓ కుటుంబాన్ని కూడా విజయవంతంగా నడిపిస్తున్నాడు. పోలియో నివారణ దినం సందర్భంగా ప్రత్యేక కథనాలు.. 6లో

## తప్పెటగుళ్లు.. కేరాఫ్ కడకెల్ల

6లో

- రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు
- కళాకారులకు ప్రత్యేక గుర్తింపు



## వకీలుసాబ్‌లు!



- వీరు లా చదువుకోలేదు
- పూర్వీకుల నుంచి అదే పేరుతో గుర్తింపు

6లో

## మేం పోలీసులం!

- హల్‌చల్ చేసిన కొందరు వ్యక్తులు
- బెల్ట్‌షాపుల నిర్వాహకులకు బెదిరింపులు
- లక్షల రూపాయలు గుంజిన వైనం
- మెంటాడ, గజపతినగరంలో చర్చనీయాంశం




మెంటాడ, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల కిందట మెంటాడ, గజపతినగరం మండలాల్లో ఓ బృందం తెగ హడావిడి చేసింది. పోలీసులం అని, ఎన్‌ఫోర్స్‌మెంట్ వాళ్లం అని బెదిరింపులకు దిగింది. సుమారు 12 గ్రామాల్లో స్వైరవిహారం చేసింది. ఈ ఘటన ఇప్పుడు మెంటాడ, గజపతినగరంలో తీవ్ర చర్చనీయాంశం అయింది. అసలు ఎవరు వారు? ఎక్కడి నుంచి వచ్చారు? అని ఆరా తీస్తున్నారు.

కొందరు వ్యక్తుల బృందం సోమవారం సాయంత్రం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులం అంటూ బెల్టుషాపుల నిర్వాహకుల నుంచి పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేశారు. వచ్చింది ఎవరనేది అర్థంకాకపోయినప్పటికీ తాము చేసిన వ్యాపారంలో లొసుగులు వుండడంతో బెల్ట్ షాపుల నిర్వాహకులు భయపడిపోయారు. అడిగినంత ముట్టజెప్పినట్టు తెలియవచ్చింది. ఆ బృందం నేరుగా బెల్టుషాపుల వద్దకే వెళ్లి హడావుడి చేసింది. తాము ఎక్సైజ్ డిపార్ట్మెంట్ నుంచి వచ్చినట్టు చెప్పారు. బెల్ట్ షాపుల నిర్వాహకులు తమను ఎప్పుడూ చూడలేదని, స్థానిక పోలీసులు, ఎక్సైజ్ సిబ్బంది తమకు తెలుసునని చెప్పగా ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ పోలీసులమని పరిచయం చేసుకున్నారు. బదిలీలపై ఈమధ్యనే ఇక్కడకు వచ్చామని కూడా చెప్పుకొచ్చారు. ఇతరులకు సమాచారం ఇస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరిస్తూనే ఇక్కడ గతంలో పనిచేసిన వారిపేర్లు కూడా చెప్పడంతో బెల్ట్‌షాపుల నిర్వాహకులు నిజమని నమ్మారు. వారి వేషం, భాష, బాడీ లాంగ్వేజ్ అన్నీ పోలీసుల మాదిరిగా ఉండడంతో సందేహం రాలేదు. బెల్ట్ షాపుల నిర్వహణ నేరమని అంటూ సోదాలు చేసి దొరికిన మద్యం బాటిళ్లను బట్టి ఒక్కో షాపు వద్ద రూ.5వేలు నుంచి రూ.10 వేలు వరకు వసూలు చేసినట్టు బయటపడింది. రెండుమండలాల్లో వారు వసూలు చేసిన మొత్తం లక్ష రూపాయల పైమాటేనని తెలుస్తోంది.

### ఇలా బయటకు పొక్కింది

పట్టుబడిన బెల్ట్ నిర్వాహకులు ఇతర బెల్ట్ నిర్వాహకులకు జరిగిన విషయం చెప్పారు. గతంలో కేసులలో ఇరుక్కున్నవారు...కేసులు నడుస్తున్న వారు...పోలీసులు,ఎక్సైజ్ సిబ్బందితో పరిచయం వున్న బెల్ట్ నిర్వాహకులు వాకబు చేసే పనిలో పడ్డారు. తామెవ్వరం బెల్ట్ సోదాలకు వెళ్లలేదని, వచ్చినవారు ఎవరో తమకు తెలియదని చెప్పడంతో తేలుకుట్టిన దొంగల మాదిరిగా తమ పరిస్థితి నెలకొందని లబోదిబోమంటు న్నారు. ఇలా ఆనోటా ఈ నోటా విషయం బయటకు వచ్చింది.

ఆంధ్రజ్యోతి వద్ద కూడా బెల్ట్ నిర్వాహకులు తమ గోడు వెళ్లగక్కారు. అయితే వచ్చినవారెవరు...ఎక్కడినుంచి వచ్చారు, నిజంగా ఎన్ఫోర్స్‌మెంట్ పోలీసులేనా, నకిలీనా అన్నది ఆసక్తికరంగా మారింది. దీనిపై తమకెటువంటి ఫిర్యాదు అందలేదని ఆంధ్ర ఎస్ఐ సీతారాం అన్నారు. తమ సిబ్బంది ఎవరూ సోదాలకు వెళ్లలేదని అన్నారు. ఎవరు వచ్చివెళ్లారో తనకు కూడా తెలియదని గజపతినగరం ఎక్సైజ్ సిఐ జనార్ధనరావు అన్నారు. కొత్త మద్యం షాపుల ఏర్పాట్లలో తాము వున్నట్లు చెప్పారు.



బెల్ట్‌షాపు

# లక్ష్యమే నడిపిస్తోంది!

● పోలియోను జయించి... జీవితంలో ముందుకు సాగుతున్న వైనం

నేడు ప్రపంచ పోలియో నివారణ దినం



ఆత్మవిశ్వాసం... ఇది తోడుంటే ఎలాంటి సమస్యనైనా అధిగమించవచ్చని పెద్దలు చెబుతుంటారు. ఈ మాటను ఎంతవరకూ విశ్వసించవచ్చు అనే సందేహాలు ఎవరికైనా ఉంటే... ఆ యోధులను చూస్తే అర్థమవుతుంది. ఆ యోధులు జీవిత యుద్ధంలో గెలిచిన వారు. పోలియో వ్యాధి తమను నడవకుండా చేయాలని ప్రయత్నిస్తే... ఆత్మవిశ్వాసం వారిని ముందుకు నడిపించి.. గెలిపించింది. గురువారం 'ప్రపంచ పోలియో నివారణ దినం'. ఈ నేపథ్యంలో పోలియోను జయించి.. తాము అనుకున్న లక్ష్యాలను సాధిస్తూ... వివిధ రంగాల్లో రాణిస్తున్న వారి స్ఫూర్తిదాయక కథనాలను పరిశీలిద్దాం రండి.



చీమల రాంబాబు

## ప్రభుత్వ ఉద్యోగమే లక్ష్యంగా...

బొబ్బిలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని ఇందిరమ్మ కాలనీకి చెందిన చీమల రాంబాబు(39)కు మూడు నెలల ప్రాయంలోనే పోలియో సోకింది. అప్పట్లో తల్లిదండ్రులకు సరైన అవగాహన లేకపోవడం... సకాలంలో వైద్యం అందని కారణంగా అతని కుడి కాలు, ఎడమ చేయి చచ్చుబడిపోయాయి. రాంబాబు వైకల్యాన్ని జయించి... అందరిలాగానే చదువుకోవాలని... ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించాలని సంకల్పించాడు. ఇప్పటికీ ఆ ప్రయత్నంలోనే ఉన్నాడు. వంగర మండలం దేవకివాడకు చెందిన రాంబాబుది మడ్డువలస రిజర్వాయరు నిర్వాసిత కుటుంబం. 2010లో బొబ్బిలి పట్టణానికి వలస వచ్చి ఇక్కడే స్థిరపడ్డాడు. తండ్రి చనిపోవడంతో తల్లి, చెల్లితో కలిసి ఉండేవాడు. అష్టకష్టాలు పడుతూ డిగ్రీ పూర్తి చేశాడు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పోషణ కోసం కొన్నాళ్లు పత్రికా కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేశాడు. ఆ తరువాత పాన్ షాపు పెట్టుకున్నాడు. రేషన్ డీలరు దగ్గర కొంతకాలం సహాయకునిగా పనిచేశాడు. ఏడేళ్లు విద్యావలంటీరుగా సేవలందించాడు. ఐదుగురి కుటుంబ సభ్యుల పోషణ భారంగా మారడంతో 2014లో స్టాంపుల విక్రేతగా లైసెన్సును పొందాడు. దీనితో గౌరవప్రదంగా జీవించగలుగుతున్నానని రాంబాబు చెబుతున్నాడు. ఎమ్మెల్యే బేబీనాయన ఆశీస్సులతో రాష్ట్ర టీడీపీ దివ్యాంగుల విభాగానికి కార్యదర్శి స్థాయికి ఎదిగానన్నారు. దివ్యాంగుడినన్న ఆత్మన్యూనత తనకు లేదని... ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న తపనతో ముందుకు వెళుతున్నానని చెబుతున్నాడు.

## స్వయంకృషితో ...

రామభద్రపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం సంపాదించడానికి అంగవైకల్యం అడ్డుకాదని ఉప్పాడ శ్రావణ్ కుమార్ నిరూపించారు. సాలూరు పట్టణంలో నివాసం ఉంటున్న ఆయన రామభద్రపురం మండలం జన్నివలస పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయనకు రెండేళ్ల వయస్సులోనే రెండు కాళ్లూ చచ్చుబడిపోయాయి. అయినా భయపడకుండా ముందుకు సాగారు. ఎంఎస్సీ ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఎంబీఏ, ఎంఏ హిందీ, బీఈడీ పూర్తి చేశారు. అవలీలగా బైక్, కారు నడుపుతూ విధులకు హాజరవడం విశేషం. వైకల్యాన్ని తలచుకొని కుంగిపోతే ముందుకు వెళ్లలేమని... ఆత్మవిశ్వాసంతో దానిని జయించాలని చెప్పే శ్రావణ్ కుమార్ ఎందరికో ఆదర్శంగా నిలుస్తున్నారు.



విధి నిర్వహణలో శ్రావణ్‌కుమార్

## పోలియో లేని సమాజం దిశగా..!

విజయనగరం రింగురోడ్డు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలియో.. ఈ వ్యాధితో ఎంతోమంది దివ్యాంగులుగా మారిన సంగతి మనకు తెలిసిందే. ఒకప్పుడు ఇది భయంకరమైన వ్యాధి. కానీ ఇప్పుడు ప్రజల్లో అవగాహన పెరిగింది. ఇది ఐదేళ్ల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు సోకుతుంది. ప్రభుత్వం సకాలంలో టీకాలు ఇవ్వడం వల్ల ఈ వ్యాధి నిర్మూలనకు అవకాశం కలిగింది. 2014లోనే భారతదేశం పోలియో లేని దేశంగా అవతరించింది.

### పోలియో అంటే..

పోలియోను.. పోలియోమైలిటీస్ అంటారు. ఇది పోలియో వైరస్ ఇన్‌ఫెక్షన్ కారణంగా వస్తుంది. ఇది వెన్నుపాము నరాలను ప్రభావితం చేస్తుంది. తద్వారా పక్షవాతం లేదా మరణానికి కూడా కారణం కావచ్చు. పోలియో వైరస్ తొలిగా గొంతులో, పేగులకు సోకుతుంది. దీని కారణంగా ఫ్లూ వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇన్‌ఫెక్షన్ మెదడు.. వెన్నుపాముకు సోకుతుంది. రక్తంలో కలిసిన క్రిములు నరాల్లోని జీవకణాల మీద ప్రభావం చూపిస్తాయి. దీంతో నాడీమండలం దెబ్బతిని కదల్చడానికి వీలులేకుండా కండరాలు బిగిసిపోతాయి..

### వ్యాప్తి ఇలా..

మురుగునీరు తాగడం... వ్యాధి సోకిన వ్యక్తి లాలాజలాన్ని తాకడం, పరిశుభ్రత లేని ఆహారం తినడం వల్ల క్రిములు ఇతరులకు వ్యాపించే అవకాశం ఉంది.

### లక్షణాలు ఇవీ...

గొంతు మంట, జ్వరం, తలనొప్పి, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, ఆయాసం, కండరాల నొప్పి, కాళ్ల లేదా చేతులు కదలడంలో ఇబ్బంది, పక్షవాతం, శాశ్వత అంగవైకల్యం సంభవిస్తుంది.

### నివారణ సులభం..

పోలియోను టీకా ద్వారా నివారించవచ్చు. మన దేశంలో ఓరల్ పోలియో వ్యాక్సిన్ ఇస్తారు. 0 నుంచి 5 ఏళ్ల లోపు ప్రతి బిడ్డకు పోలియో చుక్కలు వేస్తున్నారు.

### టీకాలతో చెక్..

చిన్నారులకు టీకా ద్వారా పోలియోకు చెక్ పెట్టవచ్చు. ప్రస్తుతం పోలియో లేని రాష్ట్రం, దేశంగా ఉంది. ఏటా జిల్లా వ్యాప్తంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. ఎందుకంటే.. పొరుగు దేశం పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్‌లలో నేటికీ పోలియో కేసులు నమోదవుతున్నాయి. అందుకే ముందు జాగ్రత్త చర్యలుగా పల్స్‌పోలియో కార్యక్రమం శతశాతం జరిగేలా ప్రభుత్వం ప్రణాళికతో ముందుకు వెళుతోంది. తల్లిదండ్రులు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో టీకాలు వేయించాలి.

-డాక్టరు భాస్కరరావు, డీఎంహెచ్ఓ, విజయనగరం

## మెకానిక్‌గా రాణిస్తూ..



బైక్ రిపేరు చేస్తున్న నాని

గరివిడి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గరివిడికి చెందిన గాడి వెంకటరమణ అలియాస్ నానీకి పుట్టుకతోనే పోలియో సోకింది. చదువుకు కుటుంబ పరిస్థితులు సహకరించలేదు. దీంతో చిన్నతనం నుంచే తనకు ఇష్టమైన మెకానిక్ వృత్తిని ఎంచుకున్నాడు. గురువుల దగ్గర బైక్ మెకానిక్ పనులు నేర్చుకున్నాడు. అనంతరం గరివిడిలో ఒక బైక్ మెకానిక్ షెడ్డును సొంతంగా ఏర్పాటు చేసుకున్నాడు. ప్రస్తుతం ఆ షెడ్‌పై వచ్చే ఆదాయంతోనే కుటుంబాన్ని పోషిస్తున్నాడు. అతని దగ్గర ఇప్పటికి సుమారు 30 మందికి యువకులు శిక్షణ పొందారు. నానీ శిష్యులు చాలా మంది గరివిడి, చీపురుపల్లి పట్టణాలతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మెకానిక్ షెడ్లు పెట్టుకొని జీవిస్తున్నారు. నానీకి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## ఉద్యోగం లేదని కుంగి పోకుండా...

గరుగుబిల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పెద్దూరు గ్రామానికి చెందిన మఱ్రాపు నాగభూషణరావు చిన్నతనంలో పోలియో బారిన పడ్డారు. నడవలేని స్థితిలో ఉన్నా... తల్లిదండ్రుల సాయంతో పాఠశాలకు వెళ్లి విద్యనభ్యసించారు. బీఎస్సీ, బీఈడీ పూర్తి చేసిన ఆయన ప్రభుత్వ ఉద్యోగ అవకాశం రాలేదని దిగులు చెందలేదు. గ్రామంలో నెట్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకొని... ప్రజలకు అవసరమైన సేవలు అందిస్తున్నారు. కంప్యూటర్‌పై అవగాహన ఉండటంతో ప్రభుత్వ పథకాలకు సంబంధించి అర్హత ఉన్న వారికి నమోదు చేయడంతో పాటు సామాజిక కార్యక్రమాల్లో ముందుంటున్నారు. ప్రస్తుతం వికలాంగ పింఛను అందుతోందని... ప్రభుత్వం స్పందించి ఉపాధి అవకాశాలు కల్పిస్తే జీవనం మెరుగుపడే అవకాశం ఉందని కోరుతున్నాడు.



నాగభూషణరావు

# వకీలుసాబ్‌లు!

## వీరు లా చదువుకోలేదు

● పూర్వీకుల నుంచి అదే పేరుతో గుర్తింపు



గజరాయునివలస గ్రామం

వకీలు (లాయరు) కావడం ఎంత కష్టమో అందరికీ తెలిసిందే. మూడేళ్లు.. ఐదేళ్లు లా కోర్సు పూర్తి చేయాలి. ఆ తరువాత లాయరుగా ప్రాక్టీసు చేయాలి. అప్పుడే జనం దృష్టిలో వకీలు (లాయరు)గా గుర్తింపు పొందుతాం. కానీ అసలు లా చదవకుండానే 'వకీలు సాబ్'లుగా గుర్తింపు పొందిన వారు ఉన్నారనే సంగతి మీకు తెలుసా? వాళ్లు ఎక్కడ ఉన్నారో... ఆ కథాకమామీషు ఏంటో చూద్దాం రండి.



అప్పలస్వామి అలియాస్ వకీలు అప్పలస్వామి

తిరుపతి అలియాస్ వకీలు తిరుపతి

సన్యాసి అలియాస్ వకీలు సన్యాసి

బొబ్బిలి/బాడంగి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి)

ఇంటి పేరు 'నల్ల'. కేవలం అది రికార్డులకు మాత్రమే పరిమితం. అందరి నోటా పలికేది 'వకీలు'. మూడు తరాల నుంచి ఆ గ్రామంలోనే కాకుండా చుట్టు పక్కల అన్ని గ్రామాల వారు వారిని 'వకీలు' అనే ఇంటి పేరుతోనే సంబోధించడం పరిపాటి. బొబ్బిలి నియోజకవర్గ పరిధిలోని బాడంగి మండలం గజరాయునివలస గ్రామంలో మూడు తరాల నుంచి 'లా' కోర్సు చదవకుండానే ఇంటిల్లిపాదీ 'వకీలు సాబ్'లుగా గుర్తింపు పొందారు. లా కోర్సు కాదు కదా...అసలు చదువే లేకుండా 'వకీలు'గా గుర్తింపు పొందడం విశేషం.

### పేరు వెనుక కథ..

గజరాయునివలస గ్రామంలో 150 ఏళ్ల క్రితం నల్ల నారాయణ, ఆయన కుమారుడు నల్ల రాములు ఉండేవారు. వీరిరువురు నిరక్షరాస్యులు. ఆ రోజుల్లో విజయనగరం రాజుల దగ్గరకు వీరు వెళుతుండేవారు. గ్రామానికి చెందిన వివాదాలకు సంబంధించి ఈ తండ్రీ కొడుకులు తరచుగా విజయనగరం, బొబ్బిలి ప్రాంతాల న్యాయవాదుల దగ్గరకు వెళ్లేవారు. దీనితో వివిధ కేసులపై అవగాహన పెంచుకున్నారు. దీనితో గ్రామంలో ఏ తగాదాలు వచ్చినా, గ్రామ పెద్దలు, ప్రజలు వీరి సలహాలు తీసుకునేవారు. వీరు కోర్టు మెట్లెక్కితే ఆ కేసు విజయవంతం కావడం ఖాయమన్న పేరు వ్యాపించింది. దీనితో నల్ల నారాయణ, అతని కుమారుడు రాములు పేర్లు పూర్తిగా మారిపోయాయి. స్థానికులే కాకుండా చుట్టు పక్కల గ్రామాల వారు కూడా వారిని వకీలు నారాయణ, వకీలు రాములుగానే పిలిచేవారు. అలా ఆ పేరు స్థిరపడిపోయింది. వారి కొడుకులు, మనవళ్లకు కూడా ఈ వకీలు అనే పేరే కొనసాగుతోంది. నారాయణ, రాములు అన్నదమ్ముల పిల్లలను కూడా వకీలు అనే ఇంటి పేరుతోనే ఇప్పటికీ అందరూ పిలుస్తుండడం గమనార్హం. నల్ల (వకీలు) రాములుకు ఐదుగురు కొడుకులు. వారు అప్పలస్వామి, సత్యం, పారినాయుడు, తిరుపతి, సన్యాసి.. వీరందరి పేరు ఉందు 'వకీలు' జత చేయడం అలవాటుగా మారిపోయింది. ఈ రెండు కుటుంబాలలో సుమారు 25 మంది దాకా ఉన్నారు. వీరిలో ఒకరిద్దరు మాత్రమే సంతకాలు చేయగలరు.

### తాతతండ్రుల నుంచి..

మా తాత- తండ్రులైన నారాయణ- రాములు నుంచి మాకు ఈ వకీలు బిరుదు సంక్రమించింది. మాకెంతో గర్వంగా ఉంటుంది. అక్షరజ్ఞానం లేకపోయినా వకీలు అని పిలుపించుకోవడం సాధారణమైన విషయం కాదు. మా గ్రామంలో పూనుగట్టు (రచ్చబండ స్థలం) ఉండేది. అక్కడ గ్రామస్థాయిలో వివాదాలు, తగాదాలకు, పంచాయితీలను, కౌన్సిలింగ్‌లు నిర్వహించేవారు. అలాంటి క్లిష్ట సమయాల్లో మా తాత. తండ్రి ఇద్దరూ కోర్టులో లాయర్లు కూడా లేవనెత్తలేని అంశాలను ఎత్తి , సునాయాసంగా పరిష్కారం చూపేవారు. దీనితో గ్రామపెద్దలంతా వకీలు నారాయణ, వకీలు రాములు లేకుండా తీర్పులు చెప్పేవారు కాదు. దీనితో మా వంశానికి వకీలు బిరుదు ఇంటి పేరుగా మారిపోయింది. మా పెదనాన్న, చిన్నాన్న పిల్లలను ఈ వకీలు బిరుదుతోనే అందరూ పిలుస్తుంటారు. మేము నామోషీగా భావించడం లేదు. ఆనందంగానే ఉంటుంది.

-వకీలు అప్పలస్వామి, గజరాయునివలస

### ఒకే పేరు... పిలిచే తీరే వేరు

ఈ గ్రామంలో మరో విశేషం ఉంది. ఒకే పేరుతో అనేక మంది ఉన్నారు. ముఖ్యంగా నల్ల అప్పలస్వామి పేరుతో చాలా మంది ఉన్నారు. ఇలా ఒకే పేరుతో ఉన్న వారందరికీ ముద్దు పేర్లు పెట్టి పిలుస్తుంటారు. రైస్ మిల్లు ఉన్న వారికి మిల్లు అప్పలస్వామి అని పిలిచేవారు. విందు భోజనాలకు వెళ్లేటప్పుడు నల్ల అప్పలస్వామి పేరు గల ఓ వ్యక్తి ఇత్తడి చెంబు (ముంత)తో ఇంటి నుంచి తాగునీటిని తీసుకెళ్లేవాడు. అతనికి 'ముంతల' అప్పలస్వామి పిలుస్తుంటారు. మరో నల్ల అప్పలస్వామి మాజీ ప్రధాని వాజ్‌పేయికి అభిమాని కావడంతో అతడిని అందరూ 'వాజ్‌పేయి' గానే పిలుస్తుంటారు. ఇద్దరు ఇరిగేషన్ ఇంజనీర్లకు సీనియర్-జూనియర్ అని పిలిచేవారు. ఇలా 'అప్పలస్వామి' అనే పేరుతో ఉన్న వారందరికీ ఏదో ఒక ప్రత్యేక పేరు ఉండేది.

# తప్పెటగుళ్లు.. కేరాఫ్ కడకెల్ల

● రాష్ట్ర వ్యాప్తంగా ప్రదర్శనలు

● కళాకారులకు ప్రత్యేక గుర్తింపు



తప్పెటగుళ్ల కళాకారులు

వీరఘట్టం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): అక్కడ అందరూ కష్టజీవులే. రెక్కల కష్టంపై ఆధారపడేవారే. కానీ కళా ప్రదర్శన ఉందంటే చాలు.. ఆ రోజు వచ్చే కూలీ డబ్బులను వదులుకొని మరీ వెళతారు. అదేదో డబ్బుల కోసం అనుకుంటే పొరపాటే. ఆ ప్రదర్శనపై మక్కువే అలా వెళ్లేలా చేస్తుందని చెబుతారు. వారే కడకెల్ల గ్రామంలోని తప్పెటగుళ్ల కళాకారులు. ఈ గ్రామంలోని కళాకారులు గత 40 సంవత్సరాల నుంచి తప్పెటగుళ్ల ప్రదర్శనలు ఇస్తున్నారు. రాష్ట్రం నలు మూలలా తమ ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. తాత తండ్రుల నుంచి వారసత్వంగా ఈ కళను నేర్చుకుంటున్నామని చెబుతున్నా రు. గ్రామంలో 60 కుటుంబాలు ఉన్నాయి. వీరంతా బృందాలుగా ఏర్పడి తప్పెటగుళ్ల ప్రదర్శనలు ఇస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో నిర్వహించే గ్రామదేవతల పండగలు, ఉత్సవాలలో వీరు ప్రదర్శనలు ఇస్తుంటారు. అందుకు కొంత మొత్తంలో ఖర్చులకు వసూలు చేస్తారు. తమ ప్రదర్శనలతో ఈ బృందాలు ఎన్నో ప్రశంసలు, సన్మానాలు అందుకున్నాయి. వీరంతా పేద కుటుంబాలకు చెందిన వారు. కళా ప్రదర్శన లేని రోజుల్లో పొలం పనులకు, గొర్రెల కాపలాకు వెళతారు. ప్రదర్శనలో వచ్చిన మొత్తం ఆ రోజు ఖర్చులకే సరిపోతుందని చెబుతున్నారు. అయినా ఈ ప్రదర్శన అంటే తమకు ఎంతో ఇష్టమని అంటున్నారు. రాష్ట్రంలోని చాలా చోట్ల ప్రదర్శనలు ఇచ్చామని తెలిపారు. ప్రభుత్వం తమలాంటి కళాకారులకు పింఛన్లు అందజేసి ఆదుకోవాలని వీరు కోరుతున్నారు.

### 40 ఏళ్లుగా ప్రదర్శనలు..

మా గ్రామస్తులు గత 40 సంవత్సరాలుగా తప్పెటగుళ్ల ప్రదర్శిస్తున్నారు. నేను కూడా ఈ కళపై ఆసక్తితో నేర్చుకొని... వివిధ గ్రామాల్లో ప్రదర్శనల్లో పాల్గొన్నా.

-ఎం.పోలిరాజు

### ఎంతో ఆనందం..

తప్పెటగుళ్ల ప్రదర్శన మాకు ఎంతో ఆనందాన్నిస్తోంది. బృందంలోని సభ్యులందరూ కలిసి ఈ ప్రదర్శన నిర్వహిస్తుంటాం. మా గ్రామస్తుల ప్రోత్సాహన్ని మరచిపోలేం.

-పి.సత్యనారాయణ, తప్పెటగుళ్ల కళాకారుడు

# అనవసరంగా రోడ్లపై తిరగొద్దు

● రాత్రి 11 దాటితే కేసులు ● ఎస్పీ వకుల్ జిందాల్

● విస్తృతంగా పోలీసుల తనిఖీలు

విజయనగరం క్రైం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కార్పొరేషన్, మున్సిపాలిటీల పరిధిలో ఎటువంటి కారణాలు లేకుండా అర్ధరాత్రి వేళల్లో రోడ్లపై తిరిగే వారిపై టౌన్ న్యూసెన్స్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని అధికారులకు ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. ఆయన ఆదేశాలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. మంగళవారం రాత్రి విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. విజయనగరం రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, మూడు లాంతర్లు, కోట జంక్షన్, అంబేద్కర్ కూడలి, రింగురోడ్డు, దాసన్నపేట, బొబ్బిలి, నెల్లిమర్ల, రాజాం మున్సిపాలిటీల్లోని ముఖ్య ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టారు. రాత్రి 11 తరువాత వ్యాపారాలు, షాపులు, టిఫిన్ బండ్లు మూసేసేవిధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. హిస్టరీ షీట్లు కలిగిన వ్యక్తుల కదలికలను గమనించాలని, ఆ వివరాలను బీట్ పుస్తకంలో నమోదు చేయాలని ఎస్పీ ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులను ప్రశ్నించి, వారి వివరాలకు పూర్తిగా తెలుసుకున్న తరువాతనే విడిచిపెట్టాలని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా గత నాలుగు నెలల్లో అర్ధరాత్రి తిరుగుతున్న 450 మందిపై కేసులు నమోదు చేశామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.



అర్ధరాత్రి తిరుగుతున్న యువకులను ప్రశ్నిస్తున్న ఎస్ఐ అశోక్ కుమార్

# అపార్ నమోదు ప్రక్రియ వేగవంతం

● ఆర్ఐవో ఆదినారాయణ ఆదేశం



ప్రిన్సిపాళ్ల సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.ఐ.ఒ. ఆదినారాయణ

రాజాం రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆధార్ తరహాలో ఇంటర్ విద్యార్థులకు ప్రభుత్వం అందించబోయే అపార్ గుర్తింపు కార్డుల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని ఆర్ఐవో ఆదినారాయణ ఆదేశించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రభుత్వ, ప్రయివేటు జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లతో ఆయన బుధవారం సమావేశమయ్యారు. పేరు, పుట్టిన తేదీ, ఆధార్, పదో తరగతి సర్టిఫికెట్‌లో ఒకేవిధంగా ఉంటే నమోదు ప్రక్రియ సాధ్యమవుతుందన్నారు. ఒకేలా లేకపోతే ఆధార్‌లో మార్పు చేసుకోవాలని స్పష్టం చేశారు. నవంబరు 11 వరకూ ఇంటర్ పరీక్ష ఫీజు చెల్లించేందుకు గడువుగా పేర్కొన్నారు. త్వరలో జరగబోయే టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రభుత్వ ఉపాధ్యాయులతో పాటు ప్రయివేటు ఉపాధ్యాయులకు కూడా ఓటు హక్కు కల్పించనున్నట్లు ఆయన వెల్లడించారు.

న్యూస్ బాక్స్

## వాటర్ ట్యాంక్ ఎక్కిన ఎంఈవో



వాటర్‌ట్యాంక్ ఎక్కుతున్న మండల విద్యాశాఖాధికారి గంగరాజు

జామి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్నంరాజుపేట గ్రామంలో నిర్వహిస్తున్న స్పెషల్ శానిటైజేషన్ కార్యక్రమంలో భాగంగా జామి మండల విద్యాశాఖాధికారి-2 గంగరాజు ఏకంగా వాటర్ ట్యాంక్ ఎక్కి పరిశీలించారు. దాన్ని శుభ్రం చేసిందీ లేనిదీ గమనించారు. దీంతో స్థానికులు, సిబ్బంది ఆశ్చర్యం వ్యక్తం చేశారు. స్థానిక పాఠశాల పరిశీలనకు వచ్చిన ఏంఈవో పక్కనే కనిపించిన వాటర్‌ట్యాంక్‌ను ఎక్కి పరిశీలించడం విశేషం.

## పారిశుధ్య పనులపై కమిషనర్ తనిఖీ

విజయనగరం రింగురోడ్డు, ఆంధ్రజ్యోతి: నగరంలోని వివిధ ప్రాంతాల్లో నగరపాలక సంస్థ కమిషనర్ పి నల్లనయ్య బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలు చేసి పారిశుధ్య పరిస్థితిని గమనించారు. వైఎస్సార్‌నగర్, సోనియానగర్, అయ్యన్నపేట తదితర ప్రాంతాల్లో పర్యటించి పారిశుధ్య పనితీరుపై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. వాటర్ ట్యాంకుల న్నింటినీ త్వరితగతిన శుభ్రపరచాలని కమిషనర్ నల్లనయ్య ఆదేశించారు.

## అంగన్‌వాడీ హెల్పర్‌పై వేధింపులు తగదు

గజపతినగరం, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపేట అంగన్వాడీ కేంద్రంలో హెల్పర్‌గా పనిచేస్తున్న మానాపురం సౌజన్యపై రాజకీయ వేధింపులు తగవని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమామహేశ్వరి డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని పురిటిపెంట గ్రామసచివాలయం ఆవరణలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. జిల్లా గౌరవ అధ్యక్షురాలు వి.లక్ష్మి పాల్గొన్నారు.

## కళాశాల విద్యార్థినులకు యూనిఫారాలు పంపిణీ

శృంగవరపుకోట రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం ప్రభుత్వ బాలికల కళాశాలలో చదువుతున్న విద్యార్థినులకు కళాశాల తెలుగు అధ్యాపకుడు రహీంషేక్‌లాల్ యూనిఫాంలను అందించారు. బుధవారం ధర్మవరం ఉన్నత పాఠశాల హెచ్ఎం ఉమామహేశ్వరరావు చేతుల మీదుగా వీటిని అందించారు.

## అమాయకులను మోసంచేస్తే సహించం

శృంగవరపుకోట రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రమైన ఎస్.కోటలో ఒక ప్రైవేట్ బ్యాంకు అమ యాకులైన ప్రజలను మోసంచేస్తుందని, ఇటువంటివారిని వదిలిపెట్టమని సీపీఎం నాయకుడు చల్లా జగన్ హెచ్చరించారు. బుధవారం బాధితుడితో కలిసి బ్యాంకుకు వెళ్లి బ్యాంకు ప్రతినిధులను, అక్కడ ఉన్న ఏజెంట్లను నిలదీశారు. ఎస్.కోట పట్టణానికి చెందిన వ్యక్తి 2019లో ద్విచక్రవాహనానికి ఫైనాన్స్ తీసుకున్నాడని, దానిని 2022 నాటికి తీర్చేశాడని, అయినా దీనికి సంబంధించి క్లియరెన్స్ పత్రం అడుగుతుంటే యాజమాన్యం ఇవ్వకుండా వేధిస్తుందని తెలిపారు. దీంతో బ్రాంచ్‌కు వెళ్లి వారిని ప్రశ్నించగా వచ్చే నెల 15లోపు సమస్య పరిష్కరిస్తామని చెప్పారని, అప్పటికీ పరిష్కరించకపోతే ప్రత్యక్ష పోరాటం చేస్తామన్నారు.

## హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు

బొబ్బిలి రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవరాయి గ్రామంలో బీసీ బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన దుప్పట్లను అందజేశారు. బుధవారం వార్డెన్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సర్పంచ్ నటరాజు చేతుల మీదుగా విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ చేపట్టారు. వసతి గృహంలో ఉండి చదువుకుంటున్న విద్యార్థులకు 102 దుప్పట్లు సరపరా చేసిందన్నారు. ఎంపీటీసీ హరికృష్ణ, మాజీ సర్పంచ్ పాటూరి కృష్ణ, సింహాచలం, గ్రామ పెద్దలు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభాస్ పుట్టిన రోజు వేడుకలు

బొబ్బిలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సినీ నటుడు ప్రభాస్ జన్మదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఆయన అభిమానులు పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. హేండ్ ఇన్ హేండ్ సొసైటీ అనాధాశ్రమంలో కేక్ కట్ చేసిన అనంతరం పిల్లలకు అల్పాహారం అందించారు. ఫ్యాన్స్ ప్రెసిడెంట్ అల్లూరి జానకీరామరాజు, యూత్ ప్రెసిడెంట్ మొకర హరీశ్ తదితరులున్నారు.

విజయనగరం దాసన్నపేట: నగరంలోని ఎన్‌సీఎస్ థియేటర్‌లో ప్రభాస్ పుట్టిన రోజు వేడుకలు ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. థియేటర్‌లో కేక్ కట్ చేసి పేదలకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కృష్ణంరాజు అభిమానులు త్రిపురపు రమణారావు, బావన శంకరరావు, బోని ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కృష్ణంరాజు అభిమాని ఖాళీదాసుకు రూ. 50 వేలు ఆర్థిక సాయం అందించారు.

# గ్రామాల్లో పారిశుధ్యం సక్రమంగా ఉండాలి

▸▸ జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్



గరివిడి: జగన్నాథపురంలో పర్యటిస్తున్న జేసీ తదితరులు

గరివిడి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం సక్రమంగా ఉండాలని జేసీ మాధవన్ అన్నారు. మండలంలో జగన్నాథపురంలో ఆయన బుధవారం పర్యటించారు. గ్రామంలో డయేరియా ఉందన్న సమాచారంతో ఆయన సందర్శించారు. పారిశుధ్య పనులు రోజూ చేస్తుండాలని, తాగునీటికి సంబంధించిన పైపులైన్లు, బోరుబావులు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలన్నారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, వేడినీరు మాత్రమే తాగాలని సూచించారు. చీపురుపల్లి ఆర్డీవో జీవీ.సత్యవాణి, తహసీల్దార్ సీహెచ్.బంగార్రాజు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రాజాం: గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు ప్రతి రోజు సక్రమంగా నిర్వహించాలని గుర్ల లాంటి పరిస్థితి ఏర్పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని జేసీ సేతు మాదవన్ మండల ప్రత్యేకాధికారి నిర్మలాకుమారిని ఆదేశించారు. బుధవారం బొద్దాం, ఎంజేవలస, గారాజు చీపురుపల్లి గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మంచినీటి పథకాలను పరిశీలించారు. తహసీల్దార్ రామకృష్ణ ఎంపీడీవో శ్రీనివాసరావు, సర్పంచ్‌లు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

### కుసుమూరు ఇసుక రీచ్ పరిశీలన

తెర్లాం, అక్టోబరు23(ఆంధ్రజ్యోతి): ఇసుక కోసం వచ్చిన వాహనాలకు ఎటువంటి ఆటంకం కలుగకుండా చూడాలని జేసీ సేతు మాధవన్ అన్నారు. బుధవారం ఆయన మండలంలో కుసుమూరులో ఉన్న ఇసుక రీచ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇసుక పంపిణీలో ఎటువంటి అవకతవకలు జరగకుండా చూడాలని తహశీల్దార్ హేమంత్‌కూమార్‌ను ఆదేశించారు. బొబ్బిలి ఆర్డీవో రామ్మోహనరావు, ఆర్.ఐ కృష్ణమూర్తి తదితరులున్నారు.

సంతకవిటి: మండలంలోని ఇసుక స్టాక్ పాయింట్‌ను బుధవారం జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ పరిశీలించారు. ఇసుక అక్రమ తరలింపులకు పాల్పడితే ఎటువంటి వారిపై నైనా చర్యలు తప్పవన్నారు. తమరాం గ్రామం వద్ద స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేశామని, వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. రీచ్ నుంచి ఇసుక రవాణా చేసే వాహనాల వల్ల ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా చూడాలని పోలీసులకు సూచించామన్నారు. మండల రెవెన్యూ అధికారులకు, మైనింగ్ శాఖ వారికి పలు సూచనలు చేశారు. ఆర్‌డీవో సత్యవేణి, ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ సత్యం, ఎంపీడీవో సురేష్ కుమార్ పాల్గొన్నారు.

## ట్యాంకర్లతో తాగునీటి సరఫరా



పీఆర్‌పేటలో ట్యాంకు ద్వారా నీటిని అందజేస్తున్న దృశ్యం

గుర్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని గూడెం, పీఆర్‌పేట గ్రామాల్లో డయేరియా కేసులు నమోదు కావడంతో ట్యాంకర్‌తో మంచినీటిని గ్రామస్థులకు అందజేస్తున్నారు. పైపులైను పూర్తిగా నిలుపుదల చేశారు. గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ప్రస్తుతానికి గ్రామంలో డయేరియా అదుపులో ఉందని వైద్యులు తెలిపారు. ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు లేవన్నారు. అందరికి మందులు సక్రమంగా అందించి ఇంటింటికి వెళ్లి పరిస్థితిని తెలుసుకున్నట్టు డాక్టర్ చెన్నై తెలిపారు.

## ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తాం



కెల్ల గ్రామంలో రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న రామ్‌మల్లిక్‌నాయుడు

గుర్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ప్రతి గ్రామాన్నీ అభివృద్ధి చేస్తామని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు తెలిపారు. బుధవారం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. మన్యపురిపేట, కెల్లా, జమ్ము, జమ్ముపేట, సేనపుపేట గ్రామాల్లో పర్యటించారు. ప్రతి గ్రామంలోనూ సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర బీసీ సెల్ కార్యదర్శి సన్యాసినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు సీహెచ్.మహేశ్వరరావు, బీసీ సెల్ నాయకుడు మండల అప్పలనాయుడు, దాసరి శివప్రసాద్, జి.రామునాయుడు, విమలారాణి, మండల నాయకులు పాల్గొన్నారు.

## జొన్నగుడ్డి ప్రాథమిక పాఠశాలకు వితరణ

విజయనగరం రింగురోడ్డు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): సామాజిక బాధ్యత (సీఎస్‌ఆర్) కింద స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా జొన్నగుడ్డి నగరపాలక ప్రాథమిక పాఠశాలకు రూ 2.5 లక్షలతో పలు పరికరాలను అందించింది. వీటిని జిల్లా కలెక్టర్ అంబేడ్కర్ చేతుల మీదుగా పాఠశాల యాజమాన్యానికి అందించారు. కంప్యూటర్, టేబుల్ బల్లలు, కుర్చీలు, డిజిటల్ బోర్డు, ఫ్యాన్లు, గ్యాస్‌పోయ్యి, వంటపాత్రలు తదితర పరికరాలను అందజేశారు. ఎస్‌బీఐ రీజనల్ మేనేజరు సురేష్‌బాబు, ఎల్‌డీఎం మూర్తి, ఎంఈవో సత్యవతి, స్వాతి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### జనసేనలో చేరిక

చీపురుపల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గరివిడి పట్టణానికి చెందిన రియల్ వ్యాపారి యడ్ల రమణ తన మిత్రులతో కలిసి జనసేన పార్టీలో చేరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు వీరికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

### తాగునీటి సమస్య లేకుండా చూడాలి

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం తాగునీటి సమస్యపై సమీక్ష నిర్వహించారు.

### ఫేక్ కాల్స్‌తో అప్రమత్తం

బొబ్బిలి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఫేక్ నంబర్ల నుంచి వచ్చే బెదిరింపు ఫోన్ కాల్స్‌తో అప్రమత్తంగా ఉండాలని బొబ్బిలి సీఐ కే.సతీష్‌కుమార్ సూచించారు. ఇటీవల కొత్త నంబర్లతో సైబర్ నేరగాళ్లు ఫోన్ కాల్స్ చేస్తూ దోపిడీకి పాల్పడుతున్నారన్నారు. బొబ్బిలి మున్సిపాలిటీ పరిధి పాతబొబ్బిలికి చెందిన మింది విజయ్‌మోహన్‌కు బుధవారం సైబర్ పోలీస్‌నంటూ ఫేక్ ఫోన్ కాల్ వచ్చిందని, అందులో డబ్బులు డిమాండ్ చేశారని తెలిపారు. ఇలాంటి కాల్స్ విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సీఐ ఒక ప్రకటనలో తెలిపారు.

### వెంకటి కుటుంబానికి న్యాయం చేయాలి

నెల్లిమర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మరణించిన నెల్లిమర్ల నగర పంచాయతీ పారిశుధ్య కార్మికుడు బొమ్మాలి వెంకటి కుటుంబానికి న్యాయం చేయాలని ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. వెంకటి సంతాప సభ స్థానిక ఇఫ్టూ యూనియన్ కార్యాలయ ఆవరణలో బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ నాయకుడు హరిబాబు అధ్యక్షతన జరిగిన సభలో సీఐటీయూ నాయకులు టి.వి రమణ, ఎ.జగన్మోహనరావు, కె.రామారావు, ఇఫ్టూ నాయకుడు కాళ్ల అప్పలసూరి తదితరులు పాల్గొని మాట్లాడారు.

### పశువుల పెంపకంతో ఆర్థికాభివృద్ధి

డెంకాడ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సన్న, చిన్నకారు రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే పాడి పంటతో పాటు సన్న జీవాలైన గొర్రెలు, మేకల పెంపకం అవసరమని మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్‌రావు అన్నారు. మండలంలోని అక్కివరం గ్రామంలో పశువైద్యాధికారి శ్రీకాంత్ ఆధ్వర్యంలో బుధవారం గొర్రెలు, మేకలకు నత్తల నివారణ టీకాల కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

### ప్రైవేటు డెయిరీల దోపిడీకి ప్రభుత్వమే కారణం

రాజాం: రాష్ట్రంలో ప్రైవేటు డెయిరీల దోపిడీకి ఈ ప్రభుత్వం వత్తాసు పలుకుతోందని జిల్లా రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు వేమిరెడ్డి లక్ష్మీనాయుడు అన్నారు. బుధవారం రాజాంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో మాట్లాడారు.

## 32 మందికి వైద్య సేవలు



చీపురుపల్లి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

చీపురుపల్లి అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గుర్ల, గరివిడి మండలాల్లోని వివిధ గ్రామాల్లో డయేరియా బారిన పడిన బాధితులకు చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ నెల 10 నుంచి 22 వరకూ 102 మంది చేరగా, ప్రస్తుతం ఆసుపత్రిలో 32 మందికి చికిత్స అందజేస్తున్నారు. గుర్లతో సహా మండలంలోని జమ్ముపేట, నాగల్లవలస, సదానందపురం, తెట్టంగి, పెనుబర్తి, గరిడ, గుజ్జింగివలస, లవిడాం, పాల వలస, గరివిడి మండలంలోని కుమరాం, వెదుళ్లవలస, కందిపేట, శివరాం, శేరీపేట, దు వ్వాం, గెడ్డపువలస, దుమ్మెద, కోడూరు, జగన్నాధపురం, చీపురుపల్లిలోని రామలింగా పురం, పేరిపి, ఇటకర్లపల్లి తదితర గ్రామాల్లోని డయేరియా బాధితులకు గత కొద్ది రోజులుగా చికిత్స అందిస్తున్నారు. కాగా, ఇప్పటి వరకూ 53 మందికి చికిత్స అందజేసి, ఇంటికి పంపించగా, మరో 15 మందిని విజయనగరం రిఫర్ చేశారు. ఇది ఇలా ఉండ గా, గరివిడి మండల నోడల్ అధికారి డా. వైవీ రమణ బుధవారం చీపురుపల్లిలో చికిత్స పొందుతున్న జగన్నాధపురం డయేరియా బాధితుల్ని పరామర్శించారు. వారి ఆరోగ్యంపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. పి. సుధీర్‌ను అడిగి తెలుసుకున్నారు.

## మాజీ సైనికుల సంక్షేమానికి కృషి చేస్తా



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణారావు

రాజాం రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మాజీ సైనికుల సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి అన్నివిధాలా కృషిచేస్తూ అండగా ఉంటామని జిల్లా సైనిక్ వెల్ఫేర్ ఆఫీసర్ మజ్జి కృష్ణారావు హామీ ఇచ్చారు. రాజాంలో ఇండియన్ ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లలో ఉద్యోగ విరమణ చేసిన మాజీ సైనికులు, వీర నారీమనులతో బుధవారం సమావేశంలో ఆయన పాల్గొన్నారు. మాజీ సైనికులకు వర్తించే సంక్షేమ పథకాల గురించి వివరించారు. డాక్యుమెంట్ పరంగా మాజీ సైనికులకు ఎలాంటి సమస్యలు ఎదురైనా సైనిక్ వెల్ఫేర్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు సమావేశంలో ఎక్స్ సర్వీస్‌మెన్ వెల్ఫేర్ అసోసియేషన్ రాజాం శాఖ అధ్యక్షులు నారంశెట్టి సురేష్, ఉమామహేశ్వరరావు, కూర్మారావు, లాడి శ్రీనివాసరావు, అనంత్, పొట్టా అప్పలరాజు తదితరులంతా పాల్గొన్నారు.

## కలెక్టర్‌కు అభినందనలు



కలెక్టర్ అంబేడ్కర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న వాజీ చానల్ ఎండీ శ్రీనివాసరావు

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 23: జిల్లా కలెక్టర్ డాక్టరు బీఆర్ అంబేడ్కర్ ఆధ్వర్యంలో పైడిమాంబ సిరిమానోత్సవం విజయవంతంగా పూర్తిచేసిన సందర్భంగా వాజీ చానల్ ఎండీ గణపతినీడి శ్రీనివాసరావు బుధవారం కలెక్టర్ అంబేడ్కర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి జ్ఞాపికను అందజేశారు. వివిధ వేదికల్లో విజయనగరం ఉత్సవాలను ఘనంగా నిర్వహించడం సంతోషకరమన్నారు. సమాచారశాఖ ఏడీ రమేష్ పాల్గొన్నారు.

## టిడ్కో చైర్మన్‌ను కలిసి అవనాపు విక్రమ్



అజయ్‌కుమార్‌కు మొక్క అందిస్తున్న అవనాపు విక్రమ్

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 23, (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర టిడ్కో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వేములపాటి అజయ్ కుమార్‌ను బుధవారం జనసేన నాయకులు అవనాపు విక్రమ్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అమరావతిలోని టిడ్కో కార్యాలయంలో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టినందుకు ఆయను అభినందిస్తూ, మెడిసిన్ ప్లాంటును బహూకరించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు పాల్గొన్నారు.

## మద్యం షాపు ముందు కొవ్వొత్తులతో నిరసన




కొవ్వొత్తులతో మహిళలు ఆందోళన చేస్తున్న దృశ్యం

బొబ్బిలి అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి పట్టణంలోని మేదరబంద జంక్షన్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన మద్యం షాపును అక్కడి నుంచి తరలించాలని డిమాండ్ చేస్తూ మహిళలు బుధవారం రాత్రి ఏడో రోజు తమ ఆందోళనను కొనసాగించారు. కొవ్వొత్తులతో తమ నిరసన తెలిపారు. ఆ వార్డుకు చెందిన మహిళలు, స్థానికులు కలిసి మద్యం షాపు ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న సంగతి తెలిసిందే. స్థానిక ఎమ్మెల్యే బేబీనాయనకు, ఎక్సైజ్ అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు. అధికారులు స్పందించి మద్యం షాపును తరలించాలని లేకుంటే ఆందోళనను ఉధృతం చేస్తామని మహిళలు హెచ్చరించారు.

● టీడీపీ నేత, మాజీ ఏఎంసీ చైర్మన్ పువ్వల శ్రీనివాసరావు స్వయంగా పాల్గొని మహిళల ఆందోళనకు మద్దతు తెలిపారు. ఎక్సైజ్ సీఐ తీరును తప్పుబట్టారు. బాధ్యతా రహితంగా ఆ యన వ్యాఖ్యలు చేయడాన్ని తప్పుబట్టారు. ఎమ్మెల్యే బేబీనాయన లేఖ ఇచ్చినా పట్టించు కోకపోవడం సరికాదన్నారు. ప్ర భుత్వం నిబంధనలు ఎంతో సడలించి ప్రజాభీష్టానికి అనుగుణంగా మద్యం విధానాన్ని ప్రవేశపెట్టిన సంగతిని మరు వరాదన్నారు. మద్యం షాపులను ఎక్క డైనా పెట్టుకునే వెసులుబాటు కల్పించారని, అలాంట ప్పుడు స్థానికులు వద్దు అంటుం టే ఇక్కడే మొండి పట్టుదలతో నిర్వహించడం సబబు కాదన్నారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తెస్తే సహించేది లేద న్నారు. సీఎం, డిప్యూటీ సీఎం, ఇతర పెద్దలందరి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళతానని పువ్వల హెచ్చరించారు. వారణాశి సీత, రామాంజనేయగుప్త, రౌతు శిరీష, వారణాశి పల్లవి, పెద్ది రోజా తదితరులు పాల్గొన్నారు.

## కడుపునొప్పి తాళలేక..

▸▸ యువకుడి ఆత్మహత్య



శివ (ఫైల్)

వంగర, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): కడుపునొప్పి భరించలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అరసాడకు చెందిన గాడి శివ(28) తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లోని శంషాబాద్ విమానాశ్రయంలో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇంట్లో ఒక శుభకార్యం ఉండడంతో ఇటీవల స్వగ్రామానికి వచ్చాడు. శివ గత కొంతకాలంగా కడుపులో అల్సర్స్ ఉండడంతో తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్నాడు. అయితే ఈ క్రమంలో మంగళవారం రాత్రి తీవ్రమైన నొప్పి రావడంతో ఇంటిలో ఉన్న పురుగుమందు తాగాడు. దీనిని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే రాజాం, శ్రీకాకుళంలోని ఆసుపత్రులకు తరలించినా ఫలితం లేకపోయింది. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు పోలీసులు అందజేశారు. మృతుడి తండ్రి అప్పలసూరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి ద ర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ షేక్ శంకర్ తెలిపారు.

## నీలయ్యవలసలో ప్రబలిన డయేరియా

● కలుషిత ఆహారమే కారణమన్న వైద్యులు

వంగర, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీలయ్యవలసలో బుదవారం రెండు డయేరియా కేసులు నమోదుకావటంతో అధికారులు అప్రమతమయ్యారు. గ్రామానికి చెందిన విద్యార్థులు బత్తిన శివ, ఎలగాడ అనిల్ కు మంగళవారం రాత్రి వాంతులు, విరోచనాలు కావడంతో వంగర ప్రాథమికారోగ్య కేంద్రానికి తరలించి చికిత్స చేశారు. అక్కడ పరీక్షలు నిర్వహించిన వైద్యులు ఒక శుభకార్యంలో కలుషిత ఆహారం(నిలువ ఉన్న చేపలు) తినటంవల్ల విద్యార్థులు అస్వస్థతకు గురైనట్టు నిర్ధారించారు. వైద్యపరీక్షలు నిర్వహించి వారిని ఇళ్లకు పంపారు. ఈ నేపథ్యంలో గ్రామంలో వైద్యశిబిరం ఏర్పాటు చేసి అనుమానితులకు వైద్యపరీక్షలు చేశారు.

## బొడ్డవలసలో చెరకు తోటలు దగ్ధం

రేగిడి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలో బొడ్డవలస గ్రామంలో బుధవారం మధ్యాహ్నం సంభవించిన అగ్నిప్రమాదంలో ఐదు ఎకరాల చెరకుతోట దగ్ధమైంది. పంటనష్టం రూ. 2లక్షల వరకు ఉంటుందని అగ్నిమాపక అధికారులు అంచనా. ప్రమాదానికి ముందుగా మజ్జి సాంబమూర్తి చెరకుతోటలో హైటెన్షన్ విద్యుత్ వైర్ల రాపిడితో నిప్పు రవ్వలు రాలటంతో పొలాలకు మంటలు వ్యాపించి క్షణాల్లో చెరకుతోటలు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సాంభూమూర్తితో పాటు అలుబిల్లి శ్రీను, అలుబిల్లి దుర్గారావు కౌలురైతు తూతిక మాధవ్, మజ్జి కృష్ణ చెందిన చెరకుతోటలకు నష్టం వాటిల్లింది. పాలకొండ అగ్నిమాపక శకట అధికారి సర్వేశ్వరరావు సిబ్బందితో వచ్చి మంటలు అదుపుచేయటంతో పెద్దప్రమాదం తప్పింది. వీఆర్వో దుర్గారావు క్షేత్రస్థాయిలో సందర్శించి నష్ట వివరాలను తహసీల్దార్ కార్యాలయానికి నివేదించారు.

## రైలు ప్రమాదంలో అస్సాం వాసి మృతి

గరివిడి, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): గరివిడి రైల్వే బ్రిడ్జి సమీపంలో మంగళవారం రాత్రి కోనార్క్ ఎక్స్‌ప్రెస్ నుంచి జారిపడి ఒక వ్యక్తి మృతిచెందాడు. అతను జేబులో ఉన్న ఆధార్‌కార్డు ఆధారంగా మృతుడు అస్సాంవాసి అని రైల్వే పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

రాజాంరూరల్: మండల పరిధిలోని బొద్దాంలో చెరువుగట్టుపై పేకాడుతున్న ఐదుగురిని బుధవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 32,970 రూపాయలు స్వాధీనం చేసుకున్నట్టు ఎస్ఐ రవికిరణ్ తెలిపారు.

## యువకుడిపై విద్యార్థిని ఫిర్యాదు

పార్వతీపురం టౌన్: తనను మోసగించాడని పార్వతీపురంలోని ఓ పాఠశాల విద్యార్థిని పార్వతీపురం టౌన్ పోలీసుస్టేషన్‌లో బుధవారం రాత్రి ఫిర్యాదుచేసింది. పట్టణ పోలీసుల కథనం మేరకు.. గుమ్మలక్ష్మీపురం మండలంలోని గొయ్యిపాక పంచాయతీ జర్న గ్రామానికి చెందిన కిలారి మోహన్‌తో విద్యార్థినికి రెండు నెలల కిందట పరిచయం ఏర్పడింది. బొబ్బిలిలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న మోహన్‌వద్దకు బుధవారం విద్యార్థిని వెళ్లింది. అక్కడ ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తడంతో మనస్తాపం చెందిన విద్యార్థిని పట్టణ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పట్టణ పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదుచేశారు.

## పడాల అరుణకు పరామర్శ

గజపతినగరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి, జనసేన పీఏసీ సభ్యురాలు పడాల అరుణ కుమారుడు శరత్ అనారోగ్య కారణంగా ఇటీవల మృతి చెందిన విషయం తెలిసిందే. దీంతో బుధవారం జిల్లా టీడీపీ అధ్యక్షుడు కిమిడి నాగార్జున, మాజీ మంత్రి కమిడి మృణాళిని అరుణను పరామర్శించారు. మండలపార్టీ అధ్యక్షులు మునకాల జగన్, ప్రదీప్‌కుమార్, గోవింద తదితరులున్నారు.

## పారిశుధ్య చర్యల్లో నిర్లక్ష్యం వద్దు

రేగిడి, అక్టోబరు23,(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటివనరుల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యం ఉండకూడదు అని మండలపరిషత్ ప్రత్యేకాధికారి, డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి సిబ్బందికి సూచించారు. మండలంలో ఖండ్యాం, నాయిరాలవలస, లచ్చరాయపురం పంచాయతీల్లో శానిటేషన్ చర్యలను బుధవారం పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలో ప్రత్యేకాధికారి పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్‌అసిస్టెంట్‌లతో సమన్వయ సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. ఎంపీడీవో శ్యామలాకుమారి, తహసీల్దార్ ఎల్లారావు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

## రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేయాలి

రాజాం: రాజాం పట్టణం విజయనగరం.శ్రీకాకుళం జిల్లాలకు కేంద్ర బిందువు కావడంతో రైల్వే రిజర్వేషన్ కౌంటర్ ఏర్పాటు చేసేలా కృషి చేయాలని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్‌కు సారది మాజీ సర్పంచ్ టంకాల వెంకటేషం కోరారు.. బుధవారం శ్యాంపురం క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు.

## నిధులు వెంటనే విడుదల చేయాలి

విజయనగరం దాసన్నపేట, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ, పీజీ, ఇంజినీరింగు విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రియంబర్స్‌మెంటు, వసతి దీవెన నిధులు వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్‌బాబు డిమాండ్ చేశారు. బుధవారం అమర్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేస్తామన్నారు. సంఘ ప్రతినిధులు నాగభూషణం, గౌరీశంకర్, దుర్గా, సుమంత్, భాను, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ధ్యానంతో గొప్పశక్తి

నెల్లిమర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ధ్యానంతో మానవ శరీరానికి గొప్ప శక్తి లభిస్తుందని పిరమిడ్ ధ్యాన గురువు దివంగత పత్రీజీ శిష్యుడు, ధ్యాన ప్రచారకుడు డాక్టర్ గోపాల కృష్ణ(లండన్) అన్నారు. నెల్లిమర్లకు సమీపంలోని బృందావన్ వ్యాలీలో పత్రీజీ శిష్యుడు వీరారెడ్డి, ఆయన కుమారుల ఆధ్వర్యంలో సుమారు రెండు కోట్ల రూపాయలతో నిర్మించిన పత్రీజెన్ పిరమిడ్ ధ్యాన మందిరాన్ని డాక్టర్ గోపాలకృష్ణ బుధవారం లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. ప్రపంచంలో ప్రతి వ్యక్తికి ధ్యానం, జ్ఞానం అవసరమన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ధ్యాన గురువులు గౌతమ్, రామారావు, సతీష్, జ్యోతి, వాకాడ శ్రీను, వీరారెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు ప్రసంగించారు.

## టిడ్కో చైర్మన్‌కు అభినందనలు

బొబ్బిలి రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టిడ్కో చైర్మన్‌గా బుధవారం బాధ్యతలు స్వీకరించిన జనసేన పార్టీ నాయకులు అజయ్ కుమార్‌కు విజయవాడలో బొబ్బిలి నియోజకవర్గం జనసేన పార్టీ ఇంచార్జి గిరడ అప్పలస్వామి ఆధ్వర్యంలో జనసైనికులు, మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెర్లాం మండలం నాయకులు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## సిలిండర్లు ఇప్పించండి

గంట్యాడ, అక్టోబరు 23(విజయనగరం): మండలంలోని బోనంగి గ్రామానికి చెందిన 21 మంది మహిళలకు స్టౌలు ఇచ్చి పది నెలలు దాటినా ఇప్పటి వరకూ సిలెండర్లు ఇవ్వకపోవడంతో బుధవారం సాయంత్రం తహసీల్దార్, సీఎస్‌డీటీకి తమ సమస్యను వివరించారు. తమను గ్యాస్ ఏజెన్సీవాళ్లు కాళ్లరిగేలా తిప్పుతున్నారని అధికారులు దృష్టికి తీసుకుని వెళ్లారు. దీపావళి నుంచి ప్రభుత్వం ఏడాదికి మూడు ఉచిత సిలెండర్లు పథకం ప్రవేశ పెట్టిందని, కానీ తమకు సిలెండర్లు ఇవ్వకపోతే ఉచిత పథకానికి దూరకావాల్సి వస్తుందన్నారు.

## నాడు విస్మరించి.. నేడు విచారిస్తారా?

(ఐదో పేజీ తరువాయి)

టీడీపీ, బీజేపీలు ఈ ఘటనపై తీవ్రంగా స్పందించాయి. టీడీపీ అధినేత చంద్రబాబు ఆలయాన్ని సందర్శించారు. వివిధ పీఠాధిపతులు సందర్శించి ఘటనపై విస్మయం వ్యక్తం చేశారు. ధార్మిక సంఘాలు ఆందోళన చేశాయి. ఇంత పెద్ద ఘటన జరిగినా శాంతిభద్రతలు అదుపు తప్పే అవకాశం ఉన్నా సీఎం హోదాలో ఉన్న జగన్ ఇటువైపుగా చూడలేదు. కేవలం కేసును సీబీ సీఐడీకి అప్పగించి చేతులు దులుపుకున్నారు. కాగా గుర్ల డయేరియా అంశాన్ని కూడా రాజకీయంగా వాడుకోవాలని జగన్ భావించారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## ఎందుకిలా?

(ఐదో పేజీ తరువాయి)

గ్రామాల్లో మంచి నీటి పరీక్షలు నిర్వహించేవారు. బోరు లేదా రక్షిత నీటి పథకాలకు చెందిన నీరు తాగవచ్చా? లేదా అనేది ప్రజలకు చెప్పేవారు. వైసీపీ హయంలో మంచినీటి పరీక్షలు ఎక్కడా నిర్వహించలేదు. ఆ కిట్లు కూడా మూలకు చేర్చారు. అలాగే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను కూడా విస్మరించంతో గ్రామాల్లో పారిశుధ్యం తగ్గింది. ఆ ఫలితం నేడు కనిపిస్తోందనేది టీడీపీ నాయకుల మాట. జిల్లాలో పరిస్థితులను స్వయంగా పరిశీలించేందుకు హోంశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత గురువారం గుర్ల రానున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా హాజరుకానున్నారు.

**నేడు జగన్ పర్యటన..**

విజయనగరం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం ఉదయం 11 గంటలకు గుర్లలోని డయేరియా బాధితులను పరామర్శించ నున్నట్టు వైసీపీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. తాడేపల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి నెల్లిమర్ల సమీపంలోని దత్తా ఎస్టేట్స్‌కి చేరుకుంటారని, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో గుర్ల వెళ్లి బాధితులను పరామర్శిస్తారని చెప్పారు. తిరిగి అక్కడి నుంచి తాడేపల్లికి వెళ్తారని వెల్లడించారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: ఎస్పీ



బెలగాం: ఆయుధాల గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

బెలగాం, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు గంజాయివంటి మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్పీ మాధవరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం పార్వతీపురంలోని బెలగాం గల పోలీస్ మల్టీ ఫంక్షన్ హాల్ ఆవరణలో పోలీసు అమరవీరులు సంస్మరణ దినం పురస్కరించుకుని ఓపెన్‌హౌస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీపోలీసులువినియోగించే ఆయుధాలు, అత్యాధునిక పరికరాలు గురించి, క్లూస్ టీం పని గురించి విద్యార్థులకు వివరించారు. బాంబు డిస్పోజల్ గురించి విద్యార్థులకు డాగ్ స్క్వాడ్ బృందం వివరించింది. పోలీస్ శాఖలో కమ్యూనికేషన్ వ్యవస్థ చాలా కీలకమని, ఫోన్ సిగ్నల్ లేని ప్రదేశంలో కూడా ఒకరి నుంచి ఒకరికి వీహెచ్‌ఎఫ్ సెట్ ద్వారా ఏదైనా సమాచారం చేరవేస్తుందని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్పీలు దిలీప్‌కిరణ్, అంకితా సురానా, ఏఆర్ డీఎస్పీ అప్పారావు పాల్గొన్నారు.

● సీతంపేట రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):స్థానికవైటీసీలో స్కిల్ కాలేజ్ విద్యార్థులకు పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం పురస్కరించుకుని బుధవారం చట్టాల పై ఎస్ఐ వై.అమ్మన్నరావు అవగాహన కల్పించారు సదస్సులో ఏఎస్సై సంజీవరావు, వైటీసీ ఇన్‌చార్జి రమణ పాల్గొన్నారు.

●సాలూరు,అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి) : సంఘ విద్రోహశక్తుల నుంచి ప్రజలను కాపాడడమే పోలీసుల ప్రధానవిధి అని పట్టణసీఐ అప్పలనాయుడు తెలిపారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్య క్రమం నిర్వహించారు.

## నగరపంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




నగర పంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న కార్మికులు

నెల్లిమర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక నగర పంచాయతీ కార్యాలయం ఎదుట మునిసిపల్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పలు సమస్యల పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు, ఫెడరేషన్ నాయకులు బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. 2016-2018 మధ్య కార్మికులకు రావాల్సిన ఎరియర్ సొమ్ము అవకతవకలపై దర్యాప్తు చేయాలని డిమాండ్ చేశారు. మృతి చెందిన కార్మికుల బిడ్డలకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ మేరకు కమిషనర్ అప్పలరాజుకు వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు బాబూరావు, శేఖర్, పైడిరాజు, శ్రీను, వెంకట్, లక్ష్మి పాల్గొన్నారు.

## బ్యాడ్మింటన్ పోటీల అబ్జర్వర్‌గా శ్రీరాములు

శృంగవరపుకోట రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల పీఈటీ పొట్నూరు శ్రీరాములు ఈనెల 28నుంచి 30వరకు తూర్పుగోదావరి జిల్లా మల్కిపురంలో జరగబోయే రాష్ట్ర స్థాయి స్కూల్‌గేమ్స్ బ్యాడ్మింటన్ అండర్ 14-17 పోటీలకు అబ్జర్వర్‌గా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇతన్ని పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

## వ్యాధులు ప్రబలకుండా చర్యలు: డీఎంహెచ్‌వో



వైద్యులకు సూచనలుచేస్తున్న భాస్కరరావు

గజపతినగరం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో డయేరియా వ్యాధులు ప్రబలకుండా పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భాస్కరరావు తెలిపారు. బుధవారం మండలంలోని కెంగువ గ్రామంలో ఆయన పర్యటించారు.మరుపల్లి పీహెచ్‌సీ వైద్యులు సుష్మా, సాయికృష్ణ, అనూజ్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

గజపతినగరం, అక్టోబరు 23: (ఆంధ్రజ్యోతి): మండలంలోని మరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖోపోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం వి.నాగమణి బుధవారం తెలిపారు. ఈనెల 22న జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ ఖోఖో పోటీల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న సురేంద్ర, రవి, దుర్గ ఎంపికయ్యారని చెప్పారు.ఈ మేరకు శుక్రవారం నుంచి చిత్తూరు జిల్లా కానిపాకంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారని తెలిపారు.

●గుర్ల, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపేట విద్యార్థి జమ్ము శ్రావణి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు హెచ్‌ఎం గౌరీదేవి తెలిపారు. రఘుమండ ఉన్నత పాఠశాల క్రీడమైదానంలో విజయనగరం జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-14 బాలబాలికల పోటీలు నిర్వహించారు. కోటగండ్రేడు జిల్లాపరిషత్ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైనట్టు పీఈటీ సుధారాణి తెలిపారు. గరికివలస జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థి మండల ధనలక్ష్మి సౌత్‌జోన్ ఖోఖో పోటీలకు ఎంపికైనట్టు పీఈటీ తెలిపారు

● నెల్లిమర్ల, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట ఉన్నత పాఠశాల విద్యార్థిని కె.భార్గవి రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయినట్లు హెచ్‌ఎం రేవల్ల ఆదినారాయణ, ఫిజికల్ డైరెక్టర్ నడిపేనసూర్యనారాయణ తెలిపారు.

●జామి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు జామి ఉన్నతపాఠశాలకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపీకయ్యారని పీడీ చంద్రశేఖర్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జగన్మోహన్,నిఖిల్‌ను హెచ్‌ఎం రెహ్మాన్ అభినందించారు.

● బొబ్బిలి రూరల్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి):బొబ్బిలి ఏపీ గురుకుల పాఠశాలలో బుధవారం అండర్-14 బాలబాలికల వాలీబాల్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహించారు. నాలుగు మండలాల నుంచి 50 మంది క్రీడాకారులు పాల్గొనగా 12 మంది బాలురు, 12 మంది బాలికలు జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పీడీ వెంకటరావు తెలిపారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు గురువారం విజయనగరంలో జిల్లా స్థాయి ఎంపికలకు పాల్గొంటారు.

## ఉచిత బస్సు ప్రయాణం హామీ నెరవేర్చాలి

విజయనగరం రింగురోడ్డు, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడస్తున్నప్పటికీ, మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం హామీని నెరవేర్చడంలో తాత్సారం చేస్తోందని డీసీసీ అధ్యక్షుడు విద్యాసాగర్ ఆరోపించారు. బుధవారం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద మహిళలకు ఉచిత ప్రయాణం అమలు చేయాలని కోరుతూ పోస్టుకార్డుల ద్వారా వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే మహిళలకు ఉచిత ప్రయాణం హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాసరావు, షరీఫ్, కరీం, రెహ్మాన్, చంద్రశేఖర్, మౌనిక, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పర్యవేక్షణ లేక.. వినియోగంలోకి రాక

● రోడ్డుపైనే కూరగాయల విక్రయాలు ● ఇదీ సాలూరులో రైతు బజారు పరిస్థితి



మెయిన్‌రోడ్డులో కూరగాయలు విక్రయిస్తున్న మహిళలు

సాలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): సాలూరులో లక్ష లాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రైతుబజారుపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వినియోగానికి నోచుకోవడం లేదు. దీంతో ఇక్కడి రైతులు, వ్యాపారులు జాతీయరహదారిపై ఎక్కడ పడితే అక్కడే కాయగూరలు, చేపలు, మాంసం విక్రయిస్తున్నారు. దీంతో మెయిన్‌రోడ్డులో నిత్యం ట్రాఫిక్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొన్నిసార్లు ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. ఈ నేపథ్యంలో రైతుబజారును వినియోగంలోకి తీసుకువచ్చి రోడ్డుపై కూరగాయలు విక్రయాలు నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్ మునిసిపల్ అధికారులను ఆదేశించారు. అయినా మునిసిపల్ అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడంలేదని పట్టణ వాసులు వాపోతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మించిన రైతుబజారు వాడుకలోకి రాకపోవడంతో అసాంఘికకార్యకలాపాలకు వేదికగా మారుతోంది.అధికారులు స్పందించి జాతీయరహదారిపై కూరగాయలు అమ్మకాలు చేపట్టకుండా చర్యలు తీసుకోవాలని, రైతుబజారును వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

## కేంద్రమంత్రికి సంధ్యారాణి కృతజ్ఞతలు



రామ్మోహన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న సంధ్యారాణి

పార్వతీపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉదయం, సాయంత్రం రెండు చొప్పున విమాన సర్వీసులు ఏర్పాటుకు కేంద్ర పౌర విమానశాఖామంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడును చర్యలు తీసుకోవడంతో రాష్ట్ర గిరిజన శాఖా మంత్రి సంధ్యారాణి కృతజ్ఞత లు తెలియజేశారు. విశాఖ నుంచి విజయ వాడకు వెళ్లే విమానం సాయంత్రం ఆరుగం టల 30 నిమిషాలకు, విజయవాడ నుంచి విశాఖపట్నానికి ఉదయం 8.30 గంటలకు మా త్రమే ఒకే విమాన సర్వీసు ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆమె కేంద్రమంత్రి దృష్టికి ఇటీవల తీసుకువెళ్లారు. ఈ మేరకు ఆయన స్పందించారు.

### సాగుపట్టాలు ఇవ్వాలి

మక్కువ,అక్టోబర్ 23(ఆంధ్రజ్యోతి): వెంకట భైరిపురంలో గిరిజనులకు సాగు పట్టాలివ్వాలని, మక్కువనుంచి సాలూరు,చినభోగిలి రహదారులు నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు వి.ఇందిర, కొల్లి గంగునాయుడు డిమాండ్ చేశారు. బుధవారం మండలంలోని వెంకట భైరిపురంలో సీపీఎం శాఖ సమావేశాన్ని నిర్వహించారు. కార్య క్రమంలో సభ్యులు సీతారాం, చినబాబు పాల్గొన్నారు.

### మంచినీటి సమస్య పరిష్కరించాలి

సీతంపేట రూరల్, అక్టోబరు 23(ఆంధ్రజ్యోతి):మండలంలోని మర్రిపాడు పంచాయతీ పరిధిలోని ఎగువ ద్వారబంధం, దిగువ ద్వారబంధం,నడిమి ద్వారబంధం గ్రామాల్లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని గిరిజన సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఇక్కడి గిరిజనులతో సమావేశంలో జిల్లా నాయకులు ఎం లక్ష్మణరావు, తిరుపతిరావు మాట్లాడుతు ఈ మూడు గిరిజన గ్రామాల్లో 80కి పైగా గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయని, నేటికి మంచినీటి సౌకర్యం లేక గ్రావిటేషన్ ఫ్లో పథకం ద్వారా వచ్చే నీటిపై ఆధారపడి జీవిస్తున్నాయని తెలిపారు.ఐటీడీఏఅధికారులు సమస్యల పరిష్కారానికి చొరవ చూపని పక్షంలో ఆందోళనకు సిద్ధమవుతామని హెచ్చరించారు.

### ఫీల్డ్‌అసిస్టెంట్ తొలగింపుపై విచారణ

గరుగుబిల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): రావివలస పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం ఫీల్డ్‌అసిస్టెంట్ తొలగించడంపై పార్వతీపురం డీఎల్‌డీవో కార్యాలయంలో బుధవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా తనను అకారణంగా తొలగించారని ఫీల్డ్‌అసిస్టెంట్ గుంట్రెడ్డి రామారావు పార్వతీపురం డివిజన్ అభివృద్ధి అధికారి రమేష్‌రామన్‌కు వినతిపత్రం అందించారు. గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు తప్పుడు ఆరోపణలతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి తొలగించారని తెలిపారు. టీడీపీకి చెందిన వ్యక్తినని కక్ష గట్టి తొలగింపునకు ఉన్నతాధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెచ్చారని చెప్పారు. అధికారులు పక్షపాతం వహించకుండా విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు. విచారణలో టెక్నికల్ అసిస్టెంట్ సౌజన్య, తదితరులు పాల్గొన్నారు.

### ట్రైబల్ పాస్టర్ల అధ్యక్షుడిగా సువార్తరావు

సాలూరు రూరల్, అక్టోబర్ 23 (ఆంధ్రజ్యోతి ): సాలూరు మండల ట్రైబల్ పాస్టర్ల ఫెలోషిప్ అధ్యక్షుడిగా సారికకు చెం దిన గుడివాడ సువార్తరావు ( సూర్యనారా యణ) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధ వారం మరిపిల్లిలో డే స్ప్రింగ్ చర్చిలో ట్రైబల్ పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గ ఎన్నిక కామేశ్వ రరావు ఆధ్వర్యంలో జరిగింది. ఉపాధ్యక్షుడిగా పవులు, కార్యదర్శిగా జోసెఫ్, సహాయ కార్య దర్శిగా చెన్నారావు, కోశాధికారిగా రాంబాబు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో తిమోతి, మత్తయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

## తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలి: మంత్రి

పార్వతీపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ పట్ల అ ప్రమత్తంగా ఉండాలన్ని కలెక్టర్ ఎ.శ్యాం ప్రసాద్‌కు సూచించినట్లు గిరిజన సంక్షేమశాఖమంత్రి గుమ్మడి సంధ్యారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని కోరారు. తుఫాన్ వల్ల ప్రజలకు ఎటువంటి సమస్య ఏర్పడినా వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు కోరారు.

### గ్రామాల్లో దండోరా

గరుగుబిల్లి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన దానా తుఫాన్ వల్ల గ్రామాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా ఉండేలా చర్యలు చేపట్టినట్లు ఎంపీడీవో జి.పైడితల్లి తెలిపారు. బుధవారం గరుగుబిల్లిలో విలేకరులతో మాట్లాడుతూ గ్రామాల్లోని రక్షిత మంచినీటి పథకాల్లో పూర్తిస్థాయిలో తాగునీరును నిల్వ ఉంచేలా కార్యదర్శులకు తెలియజేయడం జరిగిందన్నారు. తుఫాన్‌పై అప్రమత్తంగా ఉండాలని గ్రామాల్లో దండోరా వేయించినట్లు తెలిపారు. కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు.

## ఏవో పనితీరు మార్చుకోవాలి: ఎంపీపీ

కురుపాం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఏవో పనితీరు మార్చుకోకపోతే అధికారులకు ఫిర్యాదు చేస్తామని ఎంపీపీ శెట్టి పద్మావతి, ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కురుపాంలో జరిగిన మండల సమావేశంలో ఏవో నాగేశ్వరరావు మాట్లాడుతున్న సమయంలో పద్మావతి జోక్యం చేసుకుని వ్యవసాయ శాఖ కార్యక్రమాలు ప్రజా ప్రతినిధులకు కనీసం తెలియజేయడం లేదని, ఏవోతనకు నచ్చిన విధంగా వ్యవహరించడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు.కురుపాం సీహెచ్‌సీలో రోగులు, గర్భిణులకు రిఫర్ చేయడం వల్ల ఇబ్బందిపడుతున్నారని సభ్యులు ఆరోపించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు పలుఅంశాలపైఅధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎంపీడీవో జె.ఉమామహేశ్వరి, తహసీల్దార్‌ఎం.రమణమ్మ,జడ్పీటీసీ సుజాత, వైస్ ఎంపీపీ అన్నాజీరావు, రంగారావు, రాష్ట్ర ట్రైకార్‌బోర్డు సభ్యురాలు లావణ్య, ఈవోపీఆర్డీ జి.రమేష్ బాబు, మొండెఖల్ సర్పంచ్ గౌరిశంకరావు, డాక్టర్ సుకృత పాల్గొన్నారు.

## వచ్చే ఖరీఫ్‌లో శివారు ఆయకట్టుకు సాగునీరు

పాలకొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పాలకొండ మండలంలోని తోటపల్లి ఎడమ కాలువ పరిధిలో శివారు ఆయకట్టుకు వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి సాగు నీరందించనున్నట్లు నీటిపారుదల సెక్షన్-1 సహాయ కార్యనిర్వాహక ఇంజనీర్ బి.కార్తీక్ ఒక ప్రకటనలో గురువారం పేర్కొన్నారు. చి'వరి'లో కష్టాలే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో బుధనం కథనం ప్రచురితంకావడంతో ఆయన స్పందించారు. పాలకొండ మండలంలో తోటపల్లి పాత కుడి, ఎడమ కాలువలు ఆధునీకరణ పనులకు ప్రభుత్వం ఉత్తర్వులు 67 ద్వారా 2018 జూన్ 28న పరిపాలన ఆమోదం పొందినట్లు తెలిపారు. అందులో భాగంగా గతనెల వరకూ 23 శాతం మేర ఆధునికీకరణ పనులు పూర్తి చేశామని పేర్కొన్నారు. అయితే 25 శాతం లోపు జరిగిన పనులు నిలిపివేయాలని, ఈ ఏడాది సెప్టెంబరు 27న యువో నోట్ ద్వారా ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.దీంతో ఈ అంశాన్ని ప్రభుత్వ పరి శీలన కోసం ఉన్నతాధికారు లకు నివేదించినట్లు పేర్కొన్నారు. అన్ని ఆటంకాలను అధిగమించి వచ్చే ఖరీఫ్ సీజన్ నాటికి తోటపల్లి ఎడమ కాలువ పరిధిలోని పాలకొండ మండలంలోని శివారు భూములకు సాగునీటి సరఫరా చే స్తామని తెలిపారు.

## రేపు ప్రభుత్వ ఐటీఐలో జాబ్ మేళా

బొబ్బిలి, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ఏపీఎస్‌ఎస్‌డీసీ జిల్లా అధికారి జి.ప్రశాంత్‌కుమార్, బొబ్బిలి ఐటీఐ ప్రిన్సిపాల్ జీవీ రమణారావు తెలిపారు. హెటిరో డ్రగ్స్, యంగ్ ఇండియా, పేటీఎం సంస్థలలో పనిచేసేందుకు అర్హులైన వారిని ఎంపిక చేస్తారని ఆయన తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ చదివి 18 నుంచి 35 సంవత్సరాల మధ్య వయస్సు కలిగి యువత జాబామేళాలో పాల్గొనవచ్చని అన్నారు. వివరాలకు 96187 92572 లేదా టోల్ ఫ్రీ నెంబరు 99888 53335 నెంబర్లలో సంప్రదించాలని వారు తెలిపారు.

## రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకొండ, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పాలకొండ సబ్‌స్టేషన్ పరిధిలో 11 కేవీ పాలకొండ టౌన్ ఫీడర్‌పై నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఈఈ టీజీకే మూర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.మండలంలోని ఎస్.కె.రాజపురం, సి.ఎల్.నాయుడునగర్, సీతంపేట రోడ్డు, నీలమ్మకాలనీ, ఏరియా ఆసుపత్రి, ఎం.ఎం.నగర్, యాతవీధి, వేమకోటవారివీధి, రామకళామందిరవీధి, శ్రీకాకుళం రోడ్డులో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

సాలూరు, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): ఐటీఐలో మిగిలి ఉన్న సీట్ల కోసం ఐదో విడత ప్రవేశాలకోసం ఈనెల 26లోగా ఆన్‌లైన్ దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ వి.రవికుమార్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. దరఖాస్తులు చేసుకున్నవారు ఐటీఐకి వెళ్లి ఒరిజినల్ ధ్రువపత్రాలను పరిశీలన చేసుకొని ప్రోసెస్‌ను కంప్లిట్ చేసుకోవాలని కోరారు.

## స్వల్పకాలిక శిక్షణ కోర్సులకు...

సీతంపేట రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సీతంపేట ఐటీఐలో ప్రధానమంత్రి కౌసల్య వికాస్ యోజన సారధ్యంలో స్కిల్ హబ్ ఇనిషియేటివ్ ప్రోగ్రాం ద్వారా ఉచిత స్వల్పకాలిక శిక్షణా కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఐటీఐ ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి చదివిన వారు ఫోర్ వీలర్ సర్వీస్ అసిస్టెంట్ టెక్నీషియన్ కు ఈ నెల 28లోగా దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 7993795796 నెంబర్‌కు సం ప్రదించాలని కోరారు.

## మునిసిపల్ కమిషనర్‌గా శ్రీనివాసరాజు

పార్వతీపురం టౌన్, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): మునిసిపల్ ఎఫ్ఏసీ కమిషనర్‌గా జి.శ్రీనివాసరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కె.శ్రీనివాసరావు బదిలీపై వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలో పూర్తిస్థాయి కమిషనర్ కొద్ది రోజులుగా లేకపోవడంతో ఉద్యోగులు, కార్మికులు వేతనాలు నిలిచిపోయాయి. దీంతో ఇటీవల విశాఖనగరపాలక సంస్థ నుంచి మునిసిపల్ ఇంజనీరింగ్ విభాగం డీఈగా బదిలీపై వచ్చిన శ్రీనివాసరాజుకు ఎఫ్ఏసీ బాధ్యతలు అప్పగిస్తూ డీఎంఏ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయి. అలాగే టౌన్ ప్లానింగ్ విభాగం నూతన టీపీవోగా పి.ప్రమీలా రాణి, ఇంజనీరింగ్ విభాగం ఏఈగా కె. అప్పారావులు బాధ్యతలు చేపట్టారు.

## ఈఈగా మణిరాజు

పార్వతీపురం, అక్టోబరు 23 (ఆంధ్రజ్యోతి): పార్వతీపురం గిరిజన ఇంజనీరింగ్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా మణిరాజు బుధవారం బాధ్యతలను స్వీకరించారు. సాలూరు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గాపనిచేస్తున్న ఆయనకు ఈఈగా పదోన్నతిపై వచ్చారు. ఇప్పటివరకూ ఈఈగా పని చేసిన కుమార్ డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఇం జనీర్‌గా నియమితులయ్యారు. ఆయన స్థానంలో మణిరాజు బాధ్యతలు చేపట్టారు.




















